రేషన్ కష్టాలు.. మళ్లీ మొదలు



- రేషన్ డిపోల వద్ద లబ్ధిదారుల పాట్లు
- సర్వర్ పనిచేయక గంటల తరబడి క్యూలైన్‌లోనే నిరీక్షణ
- మండుటెండలో నరకయాతన
- కూటమి ప్రభుత్వ తీరుపై జనం మండిపాటు


చిన్న మండల వీధిలో క్యూలో ఉన్న మహిళలు


శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలో మండుటెండలో సైకిల్‌పై బియ్యం మోసుకెళ్తున్న బాలుడు


శ్రీకాకుళం పాత సీతారామ థియేటర్ సమీపంలోని రేషన్ డిపో వద్ద లబ్ధిదారుల క్యూలైన్


చిలకపాలెంలో లబ్ధిదారుల నిరీక్షణ

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ)/శ్రీకాకుళంరూరల్/ఎచ్చెర్ల/ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం/అరసవల్లి: వీధిన వీధిన, ఇరుకిరుకు సందులో ఇంటి వద్దకే తెల్లారేసరికే రేషన్ బండి వచ్చేది. లబ్ధిదారులు చక్కగా బియ్యం, ఇతర సరుకులు తీసుకునేవారు. ఇదంతా ఇక గతం. కూటమి ప్రభుత్వం మళ్లీ రేషన్ డిపోల్లోనే సరుకుల పంపిణీ పునఃప్రారంభం చేయడంతో లబ్ధిదారులకు తొలిరోజు ఆదివారమే చుక్కలు కనిపించాయి. ఓవైపు మండుటెండ, మరోవైపు సర్వర్ మొరాయింపు వెరసి ఉదయం వెళ్తే మధ్యాహ్నానికి గానీ బియ్యం అందని పరిస్థితి నెలకొంది. పనులు మానుకుని రేషన్ డిపోల వద్ద పెద్ద పెద్ద క్యూలైన్లలో రేషన్ తీసుకునేందుకు నిలబడి నానా అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో 60కి పైగా రేషన్ డిపోలు ఉన్నాయి. ఒక్కో డిపోకు సుమారు వెయ్యికిపైగా రేషన్‌కార్డులు మేపింగ్ చేశారు. ఒక్కో రేషన్ కార్డుకి తక్కువలో తక్కువగా నలుగురు కుటుంబ సభ్యులు ఉంటారు. గంటల తరబడి లైన్లలో నిలబడటంతో పాటు ఇచ్చే బియ్యాన్ని ఇంటివరకు తీసుకెళ్లడానికి ఇంటి నుంచి కనీసం ఇద్దరు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం ఎండ బాగా ఉండడంతో ఎక్కడికక్కడ ప్రజలు సొమ్మసిల్లిపోయారు. మరోవైపు సాంకేతిక సమస్యతో సర్వర్ మొదటి రోజు చాలా ఇబ్బంది పెట్టింది. ఒక్కో వ్యక్తికి పావుగంట నుంచి అరగంట వరకు బయోమెట్రిక్ పడక ఇబ్బందులు పడ్డారు. దీంతో విసుగెత్తిపోయి చాలామంది రేషన్ తీసుకోకుండానే ఇంటి బాట పట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటివద్దరే రేషన్ అందడంతో ఇబ్బంది లేకుండా ఆనందంగా రేషన్ తీసుకునే పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ఇబ్బందులు తప్పడం లేదని వృద్ధులు మండిపడుతున్నారు.

తొలిరోజే పరేషాన్..

శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలోని 23 పంచాయతీ ప్రజలకు రేషన్ కష్టాలు తప్పలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇంటికే రేషన్ బండి వచ్చేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ డిపో వద్దకు వెళ్లి సరుకులు తీసుకోమంటున్నారని ప్రజలు ఉసూరుమంటున్నారు. మండలంలో 55 రేషన్ డిపోలు ఉన్నాయి. ఆదివారం నుంచి పంపిణీ ప్రారంభమైనా దాదాపు అన్ని చోట్ల సర్వర్ మొరాయింపులతో ఇబ్బందులు తప్పలేదు.

ఇదేం కష్టంరా బాబూ..

ఇంటివద్దకే వచ్చిన రేషన్ తీసుకునేందుకు అలవాటుపడిన ప్రజలు డిపోల వద్ద గంటల తరబడి నిల్చుని తోపులాట మధ్య రేషన్ సరుకులు తీసుకోవడానికి నరకయాతన పడుతున్నారు. ఇదేం కష్టంరా బాబూ అంటూ ఉసూరుమంటున్నారు. లావేరు మండలం మురపాకలో క్యూలైన్ కూడా కట్టడానికి వీలు లేనందుకు ఒకరిపై ఒకరు పడి అతి కష్టమ్మీద రేషన్ తీసుకున్నారు.

ఎండీయూల రద్దుతో పాట్లు..

ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ కోసం ప్రజలు పాట్లు పడుతున్నారు. ఎచ్చెర్ల మండలంలో 60 రేషన్ డిపోలు, 17 ఎండీయూ వాహనాలు ఉండేవి. రేషన్ పంపిణీ కోసం ఆదివారం లైన్లలోనే లబ్ధిదారులు నిరీక్షించారు.

రేషన్ మోతమోయాల్సిందే

రణస్థలం మండలంలోని 73 రేషన్ దుకాణాలు వద్ద బియ్యం కోసం ప్రజలు క్యూకట్టారు. మండల వ్యాప్తంగా 28,357 రేషన్ కార్డులు ఉన్నాయి. గతంలో ఇంటి పట్టున మహిళలు రేషన్ సరుకులు తెచ్చుకునే వారు. ఇప్పుడు పనులు మానుకుని డిపో వద్దకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

పునరాలోచన చేయాలి..



ఒంటరి మహిళ కావడంతో ఐదు కేజీలు బియ్యం ఇస్తారు. జగనన్న ప్రభుత్వంలో మా ఊరిలోకే బండి రావడంతో రేషన్ తీసుకునేదాన్ని. ఇప్పుడు కిలోమీటర్ దూరం వెళ్లి డిపో దగ్గర రేషన్ తీసుకోవాలంటున్నారు. నాకు ఆరోగ్యం సరిగా లేదు. నేను ఎలా వెళ్లగలను. మాలాంటి వారి కోసం ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– ధన, బైరివానిపేట

మావల్ల కాదు..



నేను ఓ ప్రైవేట్ స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తున్నాను. సకాలంలో విధులకు వెళ్లాల్సి ఉంటుంది. మాలాంటి వారికి ఇంటివద్దకే గడిచిన ప్రభుత్వ హయాంలో రేషన్ బండి వచ్చేది. ఇప్పుడు రేషన్ తీసుకోవడం కోసం ఒకరోజు సెలవు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. రేషన్ డిపో వద్ద క్యూలు కట్టడం మావల్ల లేదు.

– శ్రీను, పీఎస్ కాలనీ


పిల్లలతో వచ్చి భుజంపై బియ్యం మోసుకెళ్తూ..


శ్రీకాకుళం రూరల్: రేషన్ డిపో నుంచి బియ్యం మోసుకెళ్తున్న దృశ్యం


ఎచ్చెర్ల: మురపాకలో రేషన్ బియ్యం కిక్కిరిసిన లబ్ధిదారులు


రణస్థలం: అర్జునవలసలో రేషన్ బియ్యం మోసుకుంటూ వెళుతున్న దృశ్యం

క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎస్పీ

శ్రీకాకుళం కల్చరల్: అఖిల భారత మానవతా సందేశ సమితి (ఆల్ ఇండియా ఫయామే ఇన్సానియత్ ఫోరం) ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం శ్రీకాకుళం ఎన్‌జీవో హోమ్ వద్ద నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. డీఎస్పీ వివేకానంద ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐపీఐఎఫ్ కన్వీనర్ అబ్దుల్ కలామ్, సలీమ్, ఎంఏ బేగ్, ముజీబ్, అక్బర్ బాషా, ఆర్‌టీ ఖాన్, షాను, ఆలిజాన్, యూసెఫ్, ఎంఏ రజాక్, జిలాని, ముబారక్, అమీర్, సత్తార్, సుకూర్‌ఖాన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హత గల లబ్ధిదారులు రేషన్ డిపో వద్దకు వచ్చి సరుకులు పొందాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఆదివారం బాదుర్లపేట వద్ద రేషన్ షాపును ప్రారంభించారు.

అరసవల్లి: అరసవల్లిలో రేషన్ డిపోను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జిలు ఉంగటి రమణమూర్తి, ఉంగటి పాపారావు, రాయిపల్లి అర్జున్, శిమ్మసూర్యనారాయణ, ఉంగటి రామ్మోహన్, శీర చిన్నారావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలో రేషన్ డిపోను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ తోటయ్యదొర, తహశీల్దార్ మంగం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 105వ నెల సాహితీ సమ్మేళనం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో సంస్థ సభ్యులు కవులు, రచయితలు కవితలను చదివారు. ముందుగా డాక్టర్ పులఖండ శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలియజేశారు. పులఖండం మరణం సాహితీలోకానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి వార్షిక నివేదిక అనంతరం ముఖ్య అతిథి తోట గోపాలరావు సాహితీ ప్రసంగం చేశారు. అనంతరం కవులు డాక్టర్ కోమలరావు, ఐఎన్‌డీ ప్రసాద్, వావిలపల్లి రాజారావు, కిల్లాన శ్రీనివాస్, రమణమూర్తి, గోపాలరావు, త్రినాధరావు, ఈశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

మార్మోగిన సాయినామ స్మరణ


షిరిడిసాయికి పూజలు చేస్తున్న భక్తులు

జి.సిగడాం : మండలంలోని పెంట గ్రామంలో షిరిడీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినామ స్మరణతో గ్రామమంతా హోరెత్తింది. వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సత్యవ్రతాలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నారాయణసేవ నిర్వహించారు.

వినాయక మందిరానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేట తోటవీధిలో వినాయక మందిర పునర్నిర్మాణానికి అంధవరపు ప్రసాద్, సంతోష్ సోదరులు రూ.30,00 విరాళంగా అందించారు. కార్యక్రమంలో తేజోమూర్తుల నాగరాజు, పార్నంది విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వరహాలరావు సేవలు ఆదర్శనీయం


వరహాలరావు దంపతులను సన్మానిస్తున్న సీపీవో బాలాజి, సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లా ముఖ్య ప్రణాళికా విభాగం గణాంకాధికారి(ఎస్‌వో) ఎంవీ వరహాలరావు సేవలు భావితరాలకు ఆదర్శనీయమని చీఫ్ ప్లానింగ్ అధికారి పి.బాలాజి ప్రశంసించారు. వరహాలరావు ఉద్యోగ విరమణ పురస్కరించుకుని, స్థానిక కలెక్టరేట్‌లో ఆయనను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెట్విజ్ జిల్లా అధికారి అల్లు సోమేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి


వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 4 నాటికి ఏడాది పూర్తవుతున్నా సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు రణస్థలంలోని పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని నిరసిస్తూ జూన్ 4న ఉదయం 9 గంటలకు రణస్థలం మండలంలోని దన్నానపేట నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీ చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రణస్థలం, జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, జి.సిగడాం మండల ప్రత్యేక ఆహ్వానితులు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు దన్నాన హరి, దుర్గాసి రామారావు, బవిరి రమణ, పచ్చిగుళ్ల సాయిరాం, కరిమజ్జి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


ముగింపు సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శంకర్


విద్యార్థులు తయారు చేసిన వస్తువులతో ఎగ్జిబిషన్

శ్రీకాకుళం కల్చరల్ : వేసవి సెలవుల నేపథ్యంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయం ఆవరణలో 40 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలతో వారు రూపొందించిన డ్రాయింగ్, పెయింటింగ్స్, పేపర్, వ్యర్థాలతో తయారుచేసిన ఇంటి డెకరేషన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్, సామాజికవేత్త సత్యవతి తదితరులు మాట్లాడుతూ చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. భరతనాట్యం నేర్చుకున్న చిన్నారుల ప్రదర్శన, చక్కగా ఆకట్టుకుంది. వేసవి శిబిరం నిర్వహించిన ఎల్.నందికేశ్వర రావు, బీఎంఎస్ పట్నాయక్‌లను, విద్య నేర్పిన టీచర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవభూషణరావు, నిక్కు హరిసత్యనారాయణ, నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, సాయిప్రసాద్, ఎల్.దీప్తి, టి.నీరజా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి పనిచేస్తే సముచిత స్థానం


గొర్లె కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పిన్నింటి సత్యంనాయుడు

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా ఇటీవల ఎంపికైన జె.ఆర్.పురం గ్రామానికి చెందిన పిన్నింటి సత్యంనాయుడు కృతజ్ఞతలు తెలుపుతూ కిరణ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీలో అందరికి తగిన సమయంలో గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాం, నాయకులు దన్నాన హరి, దుర్గాసి రామారావు, కరిమజ్జి భాస్కరరావు, దన్నాన సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ లాసెట్‌కు స్పందన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం నిర్వహించిన మోడల్ లాసెట్ తమకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందని అభ్యర్థులు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఎంపీఆర్ లా కాలేజీలో ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, సంఘం సీనియర్ సభ్యులు, శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎన్ని సూర్యారావుల ఆధ్వర్యంలో కాలేజీ ప్రిన్సిపాల్ కె.మోషే సహకారంతో మోడల్ లాసెట్ నిర్వహించారు. తొమ్మిదేళ్లుగా మోడల్ లాసెట్ నిర్వహించడం అభినందనీయమని న్యాయవాది తలే లక్ష్మణరావు అన్నారు.

అద్భుత కావ్యం సుందరకాండ


రామకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం హనుమత్ వైభవం–సుందరకాండ అనే అంశంపై టి.పి.రామకృష్ణ ఆధ్యాత్మిక ప్రవచనం చెప్పారు. హనుమ, రామలక్ష్మణుల అనుబంధం, సుగ్రీవునితో శ్రీరాముని స్నేహం, సీత అన్వేషణలో హనుమ చేసిన సాయం, నిరీక్షిస్తున్న రామునికి సీతమ్మను చూశానని చెప్పి ఆనందం కలిగించిన తీరును వివరించారు. ముందుగా వక్త రామకృష్ణను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు ఆర్.నారాయణమూర్తి, డాక్టర్ మోహనరావు, విశ్వేశ్వరరావు, శ్రీమన్నారాయణ, నరసింహమూర్తి, కామేశ్వరరావు, సూరిబాబు, రాంబాబు, ఈశ్వరరావు, పట్నాయక్, మనోహర్, లక్ష్మీ, సరస్వతి పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని కొనసాగించండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి మీడియా క్రికెట్ పోటీలకు జిల్లాకు చెందిన జర్నలిస్టులు ఆదివారం బస్సులో బయలుదేరారు. ఈ వాహనాన్ని బంగ్లా వద్ద జేసీ జెండా ఊపి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

బురద రోడ్డుతో కష్టాలు



రణస్థలం మండలంలోని తెప్పలవలస పంచాయతీ పాపారావుపేట గ్రామానికి వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడినా రోడ్డు బురదమయంగా మారి ఆటోలు, ద్విచక్ర వాహనాలు కూరుకుపోతున్నాయి. పాపారావుపేట నుంచి మీసాలబడి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వంలో అవసరమైన చోట రోడ్లు వేయకుండా ప్రజాప్రతినిధుల గ్రామాలకు, ఇళ్లకు వేసుకుంటున్నారని, ఇప్పటికైనా అధికారులు తమ గ్రామానికి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

–రణస్థలం

సిరిమానుకు చల్లదనం



పాత శ్రీకాకుళంలో జరుగుతున్న సిరిమాను ఉత్సవాలలో భాగంగా రెండు సిరిమాను బండ్లకు మహిళలు ముగ్గులు సమర్పించారు. ఈ బండ్లను కిన్నెరవాడ నుంచి తెచ్చారు. సిరిమాను పండగ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే గొండు శంకర్ సిరిమానుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సిరిమాను కమిటీ అధ్యక్షుడు డి.పి.దేవ్, సభ్యులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

మూఢ నమ్మకాలు వీడాలి



సమాజంలో మూఢనమ్మకాలతో ఎంతోమంది బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నార బాల కథా నిలయం అధ్యక్షుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోగెల ఉమామహేశ్వరరావు అన్నారు. బలగ హడ్కో కాలనీ గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 'మూఢనమ్మకాలు విడనాడండి' అనే స్కిట్‌ని చిన్నారులు ప్రదర్శించారు. రోగిగా సంతోష్, తల్లిగా దీపిక సహాయకురాలుగా యామిని, డాక్టర్‌గా జోగేంద్ర సాయి, పంతులుగా పూర్ణచంద్రరావు, పిల్లిగా భవిత అద్భుతంగా నటించారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత విద్యార్థులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

5 నుంచి ఉమారుద్ర కోటేశ్వర వార్షిక కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ఈఓ సుకన్య, అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ సాయంత్రం ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమై.. 11న నాగావళి నదిలో ఉత్సవ మూర్తుల త్రిశూల తీర్థస్నానం, ధ్వజా అవరోహణంతో ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు. అదే విధంగా, చిన్నబజారులో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి 7 వరకు వార్షిక కల్యాణ వేడుకలు జరుగుతాయని ఈవో మాధవి, అర్చకులు శ్రీనివాసాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

యోగాతో మానసిక దృఢత్వం

శ్రీకాకుళం అర్బన్: యోగాతో మానసిన దృఢత్వం, శారీరక ఆరోగ్యం లభిస్తుందని విశ్రాంత ఉపాధ్యాయుడు బి.ప్రభాకరరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగాంధ్రను పురస్కరించుకొని గ్రంథాలయ పాఠకులచే విశ్రాంత ఉపాధ్యాయుడు బి.ప్రభాకరరావు ఆదివారం యోగా చేయించారు. యోగా, ధ్యానం చేయటం వల్ల ఆలోచనలు చురుగ్గా ఉంటాయని, అలసట ఉండదన్నారు.